క్లుప్తంగా

బోనస్ జమ చేయాలి


ర్యాలీగా వెళ్తున్న రైతు సంఘం నాయకులు

సుజాతనగర్: రైతులు పండించిన సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్‌ను వెంటనే జమ చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మ డిమాండ్ చేశారు. సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రైతు సంఘం కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రైతులు ర్యాలీగా వెళ్లారు. అనంతరం తహసీల్దార్ శిరీషకు వినతిపత్రం అందించారు. అనంతరం రైతు సంఘం మండల కార్యదర్శి కాట్రాల తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో ధర్మ మాట్లాడారు. బోనస్ ఇస్తామని చెప్పి రైతుల ఓట్లతోని గద్దెనెక్కిన ప్రభుత్వం.. ప్రస్తుతం రైతుల ఖాతాల్లో జమ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వీర్ల రమేశ్, బాలు, వెంకటేశ్వర్లు, భూక్యా శంకర్, చప్పిడి వెంకటేశ్వర్లు, బచ్చలికూర శ్రీనివాస్, కొంపెల్లి ఐలయ్య, మురిపిటి నాగరాజు, లింగయ్య, శంకర్, భద్రు, నవీన్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కార్మికులు

జూలూరుపాడు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఎంపీఓ తులసీరామ్‌లకు జీపీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ నాయకుడు గోపాల్‌రావు మాట్లాడుతూ.. జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో బానోత్ ధన్వంతరావు, తంబర్ల లక్ష్మీ, వినోద్, రాంబాబు, నాగు, నరేశ్, వెంకటేశ్వర్లు, హనుమంతరావు, నరసింహారావు, సేవ్యా పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు వేగంగా నిర్మించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: నిర్దేశించిన ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించగా.. ఎంపీడీఓ మాట్లాడారు. తక్కువ ఖర్చుతో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను గతంలో నిర్మించిన విధంగా కాకుండా ప్రత్యేక నమూనాతో నిర్మించాలని చెప్పారు. కేవలం పంచాయతీ సిబ్బందిని, అందుబాటులో ఉన్న రాళ్లు, నిర్మాణ రంగ వ్యర్థాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో ఇంకుడు గుంతలను నిర్మించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీఓ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పరిశీలించాలి


కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: పట్టణంలోని అన్ని వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పరిశీలించి చేపట్టాలని మాజీ చైర్‌పర్సన్, మాజీ కౌన్సిలర్లు కోరారు. సోమవారం ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ సుజాతను కలిసి వారు మాట్లాడారు. పట్టణంలో ఎండాకాలంలో మంచినీటి కొరత రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. వివిధ వార్డులలో విద్యుత్ స్తంభాలు వేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కాపు సీతాలక్ష్మి, దామోదర్, రుక్మాంగధర్‌బండారి, అంబుల వేణు, వేముల ప్రసాద్ ఉన్నారు.

తవ్వారు.. వదిలేశారు..

- గూడెం మున్సిపాలిటీలో నత్తనడకన అభివృద్ధి పనులు
- కంకర, ఇసుక లేక జాప్యం.. అవస్థలు పడుతున్న ప్రజలు
- తవ్వి వదిలేసిన గుంతలతో తరచుగా ప్రమాదాలు



ఓ కూడలిలో గుంత తవ్వి వదిలేసిన దృశ్యం
(ఇన్‌సెట్) షాపుల ముందు రోడ్డు విస్తరణకు గుంత తవ్వి వదిలేసిన దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోంది. ఈ పనులు పూర్తయితే సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని భావించగా.. సౌకర్యాల మాటేమో కానీ పనులు ముందుకు సాగక ప్రమాదాలు ఎదురవుతున్నాయి. తవ్వి వదిలేసిన గుంతల్లో ఇప్పటికే పలువురు గాయాలపాలయ్యారు. కొత్తగూడెం పట్టణ పరిధి సెవెన్‌హిల్స్ ఏరియా నుంచి సింగరేణి ప్రధాన ఆస్పత్రి వరకు రోడ్డు విస్తరణ పనులు గత ఏడాది నుంచి జరుగుతున్నాయి. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ నుంచి విడుదలైన రూ.2 కోట్లతో చేపడుతున్న ఈ పనుల్లో భాగంగా నెలన్నర కిందట సెవెన్‌హిల్ ఏరియా నుంచి భజన మందిరం రోడ్డు, గాజుల రాజంబస్తీ, హనుమాన్ బస్తీ ఏరియాల్లో రోడ్డు విస్తరణ కోసం రోడ్డు పక్కన గుంతలు తవ్వారు. అందులో కంకర, ఇసుక, సిమెంట్ నింపి రోడ్డు నిర్మించాల్సి ఉండగా ఆ పనులేమీ జరగడం లేదు. దీంతో స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డు పక్కన ఇళ్లు, వివిధ రకాల దుకాణాల వారు ఉండడంతో ఆయా గుంతల మీదుగా రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. రాకపోకలు సాగించే సమయంలో చాలా మంది అందులో పడి గాయాలపాలయ్యారు. విషయం తెలియని ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళల్లో వచ్చి అందులో పడితే ప్రాణనష్టం కూడా జరిగే అవకాశమూ ఉంది. ఇక గుంతలను తవ్వి వదిలివేయడం వల్ల సెవెన్‌హిల్స్ నుంచి సింగరేణి ఆస్పత్రి వరకు కూడా దుమ్ము, ధూళి విపరీతంగా రావడం వల్ల ఆయా ఏరియాల పరిధిలో ఉన్న ఇళ్ల వారు, దుకాణాల వారు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.

కంకర, ఇసుక దొరకడం లేదట..

కొత్తగూడెంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కంకర, ఇసుక దొరక్కపోవడంతో ఆలస్యమవుతోందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాకు ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేశారు. అలాగే, కంకర పరిస్థితి అదే విధంగా ఉందంటున్నారు. కానీ, నిబంధనల ప్రకారం గడువులోగా కాంట్రాక్టర్ నాణ్యతతో పనులను పూర్తి చేయాల్సిన అవసరముంది. లేనిపక్షంలో మున్సిపల్ అధికారులు వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం, నోటీసులు జారీ చేయడం వంటివి చేయాలి. అయితే, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోగా.. పనులపైనా దృష్టి సారించకపోవడం గమనార్హం.

పనులు పూర్తయితేనే సెంట్రల్ లైటింగ్

పట్టణంలోని సెవెన్‌హిల్స్ ఏరియా నుంచి సింగరేణి ఆస్పత్రి వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. నెలన్నర కిందట రోడ్డు విస్తరణ కోసం తవ్వన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి పూర్తయితే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యే అవకాశముంది. రోడ్డు విస్తరణ తర్వాత డివైడర్ నిర్మించి స్తంభాలు ఏర్పాటు చేసి లైట్లు బిగించాల్సి ఉంటుంది. అయితే, రోడ్డు విస్తరణ పనుల దశలోనే ఆటంకాలు ఎదురుకావడంతో మిగతావన్నీ ఎప్పుడు పూర్తవుతాయా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు చొరవ చూపాలని.. లేనిపక్షంలో ప్రమాదాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు.

పనులు త్వరగా జరిగేలా పర్యవేక్షణ

కొత్తగూడెం పట్టణ పరిధిలోని సెవెన్‌హిల్స్ ఏరియా నుంచి సింగరేణి ఆస్పత్రి వరకు కూడా రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఇవి త్వరితగతిన పూర్తి చేసేలా నిత్యం పర్యవేక్షిస్తాం. ఒకవేళ పనులు సకాలంలో పూర్తి కాకుంటే కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేస్తాం.

–రవికుమార్, మున్సిపల్ డీఈ

ఆశా వర్కర్ల నిరసన


జూలూరుపాడు: వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు



ఇల్లెందురూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

ఇల్లెందురూరల్/జూలూరుపాడు/పాల్వంచరూరల్/టేకులపల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆశా కార్యకర్తలకు నెలకు రూ.18 వేలు వేతనం చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రవికుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత తాళ్లూరి కృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుత బడ్జెట్‌లో ఆశ కార్యకర్తలకు కేటాయింపు పెంచాలని, ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశ కార్యకర్తలకు పదోన్నతి కల్పించాలని, వృత్తిపరమైన టార్గెట్లు రద్దు చేయాలని, రూ.50 లక్షల వరకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఉద్యోగ విరమణ రోజునే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చంద్రకళ, విజయ, ఆదిలక్ష్మి, కమల, రాంబాయి, రాములమ్మ, కౌసల్య తదితరులు పాల్గొన్నారు. ఇదే అంశంపై జూలూరుపాడు వైద్యాధికారి వెంకటేశ్వర్లుకు ఆశా కార్యకర్తలు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేశ్, ఆశా కార్యకర్తలు పూనెం ఝాన్సీ, వెంకటలక్ష్మీ, పద్మ, సరోజ పాల్గొన్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జూలూరుపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ వివేక్‌కు అందజేశారు. దొడ్డ రవికుమార్, కె.సత్య, ఉషా, యశోద, సుజాత, శ్రీలక్ష్మి, సువార్త, జయ, మరియమ్మ, విజయ, పావని, దేవి పాల్గొన్నారు. ఇదే అంశంపై టేకులపల్లి పీహెచ్‌సీలో, తహసీల్దార్ నాగభవానీకి ఆశా కార్యకర్తలు వినతిపత్రం అందించారు. భూక్యా మజహరి, మంగతాయారు, జి.లక్ష్మి, సారమ్మ, రమ, సుజాత పాల్గొన్నారు.

ఆహార తనిఖీలు నిర్వహించాలి


వినతిపత్రం అందజేస్తున్న రఘుమాచారి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీలో సరైన ఆహార తనిఖీలు లేకపోవడంతో అక్రమ వ్యాపారుల ఆగడాలకు హద్దు లేకుండా పోయిందని, సామాన్యుల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారని తెలంగాణ వినియోగదారుల సమాచార హక్కుల చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు జూలూరి రఘుమాచారి ఆరోపించారు. సోమవారం కొత్తగూడెం మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్ సుజాతను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఐఎస్ఐ ప్రభుత్వ గుర్తింపు లేకుండా మినరల్ వాటర్ పేరుతో అక్రమ నీటి వ్యాపారం నడిపిస్తున్నారని తెలిపారు. ఐఎస్ఐ గుర్తింపు లేని వాటర్ ప్లాంట్లను తక్షణమే సీజ్ చేయాలని, హోటళ్లలో నిల్వ ఆహార పదార్థాలు, ఫ్రిజ్‌లలో దాచి తిరిగి వాటిని వినియోగదారులకు అంటగడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో కొడూరి నాగేశ్వరరావు, చంద్రశేఖర్, అన్నెబోయిన ఎల్లయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్‌యాదవ్, ఠాగూర్ పాల్గొన్నారు.

ఇచట బైక్ నిలపొచ్చు..!



ఇల్లెందు: ఇచట వాహనాలు నిలుపరాదు.. అని రాసిన చోటనే ఓ వ్యక్తి బైక్ నిలిపాడు. ఇల్లెందు బస్టాండ్‌లో హోటల్ ఎదుట ఓ చోట గోడ మీద 'ఇచ్చట వాహనాలు నిలుపరాదు' అని రాయగా.. సరిగ్గా అక్కడే ఓ వ్యక్తి బైక్ పార్కింగ్ చేసి వెళ్లిపోయాడు. రాసిన వాక్యం వద్దనే బైక్ నిలిపి నిబంధనలు బేఖాతరు చేశాడని ప్రయాణికులు చర్చించుకున్నారు.

'సీతారామ' నీటిని మళ్లించండి


మాట్లాడుతున్న ఈసాల సురేశ్

ఇల్లెందు: సీతారామ ప్రాజెక్టు నీటి వల్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సస్యశ్యామలం అవుతుందని జిల్లా ప్రజలు ఆశ పడ్డారని, ఇప్పటికైనా ఆ ప్రాజెక్ట్ నీటిని మళ్లించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఏఎస్‌పీ) రాష్ట్ర కార్యదర్శి ఈసాల సురేశ్ తెలిపారు. సోమవారం ఇల్లెందులోని గోవింద్ సెంటర్ పెన్షనర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మైదాన ప్రాంతాలకు గోదావరి నీరు తరలిస్తున్నారని, పేదలు, గిరిజనులు సాగు చేసుకునే భూములకు నీరు ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లాకు సాగునీరు అందేవరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. వి.చంద్రయ్య, పి.శివరాం, వి.నాగేశ్వరరావు, రామచంద్రు, చీమల వెంకటేశ్వర్లు, కొర్స కోటయ్య, పాడెం కోటయ్య పాల్గొన్నారు.

ఆర్థిక పునరావాస పథకానికి ఎంపిక

టేకులపల్లి: కలెక్టర్ ఆదేశాల మేరకు దివ్యాంగ నిరుద్యోగులకు ఆర్థిక పునరావాసాన్ని కల్పించేందుకు ఉద్దేశించిన ఈఆర్ఎస్ పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ఇంటర్వ్యూలు సోమవారం టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ పథకానికి మండలంలో మొత్తం 136 మంది దరఖాస్తు చేసుకోగా.. 15 మంది లబ్ధిదారులను గుర్తించి వారికి ఇంటర్వ్యూ నిర్వహించి, ముగ్గురిని ఎంపిక చేశారు. సీడీపీఓ కేఎం తార, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జేఎల్ గాంధీ, ఏపీఎం రవి, సూపర్‌వైజర్లు నిర్మల, యశోదమ్మ, ఖలీదాబేగం, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

జూలూరుపాడు: స్థానిక జామా మజీద్‌లో సోమవారం రాత్రి ముస్లింలకు కాంగ్రెస్ జిల్లా నాయకుడు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు లేళ్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో దొండపాటి శ్రీనివాసరావు, దుద్దుకూరి మధుసూదన్‌రావు, వేల్పుల నరసింహారావు, శ్రీనివాసరావు, రాంశెట్టి నాగేశ్వరరావు, బీసీ సంఘం నాయకుడు ముదిగొండ వెంకటప్పయ్య, జామా మజీద్ ప్రెసిడెంట్ సయ్యద్ యాసిన్, మతగురువు ఆతీకమ్, ఎస్కే ఆరిఫ్, ఎస్కే మైబూ, ఎస్కే ఖాసీం, ఎస్కే కరీముల్లా, ఎస్కే సిద్దిక్, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

టేకులపల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆదేశాల మేరకు సీనియర్ అధ్యాపకురాలు బసవమ్మ, కెమిస్ట్రీ అధ్యాపకుడు నాగేశ్వరరావు పరీక్ష ప్యాడ్‌లు, మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం మెరుగు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లను నిర్వీర్యం చేయొద్దు..



టేకులపల్లి: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


పాల్వంచరూరల్: సీడీపీఓకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

టేకులపల్లి: ఐసీడీఎస్‌లను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ పథకం, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రద్దు చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా నాయకురాలు ఈసం వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ నెల 17, 18 తేదీల్లో 48 గంటల ఆందోళన కార్యక్రమంలో భాగంగా సోమవారం టేకులపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్వాడీ టీచర్స్, హెల్పర్లకు గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాల ద్వారా ఐసీడీఎస్‌ని క్రమంగా నిర్వీర్యం చేయాలని చూస్తోందని, అందులో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని తెచ్చిందని, ఇది అమలు జరిగితే ఐసీడీఎస్ స్వతంత్రంగా ఉండదని, అనేక మార్పులు చోటు చేసుకుంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొండపల్లి శకుంతల, ఎం.సారమ్మ, పి.రాజేశ్వరి, ఎం.సుజాత, కె.రాజేశ్వరి, ఇ.అనసూర్య, పూలమ్మ, కె.భద్రమ్మ, కడుదుల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన దీక్ష

పాల్వంచరూరల్/ఇల్లెందురూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ టీచర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సీడీపీఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓకు అందజేశారు. దొడ్డ రవికుమార్, కె.సత్య, పద్మ, అచ్చమ్మ, రమ్య, బాను, పద్మ, కృష్ణవేణి, రాజ్యలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనలో అబ్దుల్ నబీ, తాళ్లూరి కృష్ణ, ఆలేటి సంధ్య, ఫాతిమా, దేవేంద్ర, వనజ, సుభద్ర, సోమలక్ష్మి, దేవమణి, దీప్తి, దయావతి, యాకమ్మ పాల్గొన్నారు.

ఏజెన్సీ దళితుల రిలే నిరాహార దీక్ష


మాట్లాడుతున్న బొమ్మెర శ్రీనివాస్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు స్థానిక రిజర్వేషన్ అమలు చేయాలని, ఎస్సీ రైతుల సాగు భూములకు, పోడు భూములకు ఆంక్షలు లేకుండా హక్కు పత్రాలు ఇవ్వాలని ఏజెన్సీ ప్రాంత దళితులు సోమవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. శిబిరాన్ని ట్రేడ్ యూనియన్ జాతీయ నాయకులు గొల్లపల్లి దయానంద్, బీఎస్పీ సీనియర్ నాయకులు తాండ్ర వెంకటేశ్వర్లు ప్రారంభించారు. షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాలనా సౌలభ్యం కోసం ఏర్పడిన తెలంగాణలో ఎస్సీ కులాల అభివృద్ధి సంక్షోభంలో పడిందని, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టి సారించి న్యాయం చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతం పేరుతో ఎస్సీ కులాలను అభివృద్ధికి దూరం చేయొద్దని చెప్పారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజర్ ఎనగంటి కృపాకర్, ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు కొమ్ము శ్రీరాములు, రాసమళ్ల నర్సయ్య, ఉండేటి దేవరాజు, బల్లెం ప్రకాష్, బొమ్మెర సత్యం, రాములు, కర్లపూడి సుందర్ లాల్, మెంతెన ప్రభాకర్‌రావు, కళాకారుడు మెంతెన కొండలరావు, కడారి నాగమణి, మిరియాల ఈశ్వరమ్మ, వెంకటమ్మ, కడారి రాములమ్మ, నరసమ్మ, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని జయించండి..


ఇల్లెందు: విద్యార్థినికి హాల్‌టికెట్ ఇస్తున్న దృశ్యం


పాల్వంచరూరల్: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

ఇల్లెందు: పరీక్ష సెంటర్‌లోకి చేరిన విద్యార్థులు ప్రశ్నా పత్రం చూసి ఒత్తిడికి లోను కావొద్దని, ఒత్తిడిని జయించాలని జేకే సింగరేణి హైస్కూల్ టెన్త్ విద్యార్థులకు సింగరేణి స్కూల్ సీనియర్ పర్సనల్ ఆఫీసర్, కరస్పాండెంట్ సుధాకర్ సూచించారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024–25 విద్యా సంవత్సరం విద్యార్థులు టెన్త్‌లో అత్యుత్తమ మార్కులు సాధించాలని కోరారు. ప్రతీ విద్యార్థి పరీక్ష సెంటర్‌కు కనీసం 20 నిమిషాల ముందు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ జాయింట్ సెక్రెటరీ సునీల్, ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సుభాష్‌నగర్ జెడ్పీహెచ్ఎస్‌లో..

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం సోమవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్, ఎస్సై నాగుల్‌మీరా, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, సుబ్బారెడ్డి, రాజేశ్, సువర్ణ, కల్యాణి, అనిమెలియా, బాలాజీ, జావెద్, రఘు, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

యానంబైల్ హైస్కూల్‌లో..

పాల్వంచరూరల్: మండలంలోని యానంబైల్ హైస్కూల్లో సోమవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. హెచ్ఎం.ప్రకాశ్‌రావు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా, కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్లో సోమవారం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి తాండ్ర మధుకర్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా సంపూర్ణ ఆరోగ్యంతో పరీక్షలు రాయాలన్నారు. పదో తరగతి పూర్తయిన తర్వాత వివిధ కోర్సుల్లో సీటు సంపాదించేందుకు ఐటీడీఏ పీఓ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కెరీర్ గైడెన్స్‌పై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. సమావేశంలో హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూలూరుపాడు హైస్కూల్‌లో..

జూలూరుపాడు: గత ఏడాది కంటే ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తామని కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సంజీవరావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు (ఫేర్‌వెల్ డే) సభ నిర్వహించగా.. హెచ్ఎం మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మద్దిశెట్టి శ్రీనివాసరావు, బి.సంపత్, ఖాజామియా, శంకర్‌నాయక్, కె.శ్రీనివాసరావు, సత్యం, రాణి, మిర్యాల రమేశ్, పీడీ యుగంధర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సాహిత్యరత్న అవార్డు గ్రహీతకు సన్మానం


సదానందాన్ని సన్మానిస్తున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): సాహిత్యరత్న అవార్డు గ్రహీత జినుకల సదానందాన్ని కొత్తగూడెం ఏరియా కల్చరల్ స్పోర్ట్స్, గేమ్స్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు ఎండీ రజాక్ ప్రగతివనంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సకినాల సమ్మయ్య, గోపి, కుమారస్వామి, మోహన్‌రెడ్డి, శరిగరపు కుమార్, సీహెచ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల విధానాలను ప్రతిఘటించాలి


మాట్లాడుతున్న యాసా రోశయ్య

జూలూరుపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యాసా రోశయ్య పిలుపునిచ్చారు. సోమవారం జూలూరుపాడులో జరిగిన రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల చట్టాన్ని తీసుకురావాలని, మిర్చి క్వింటాకు రూ.25 వేలు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న పాల్వంచ మండలం జగన్నాథపురంలో జరిగే తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని, ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతున్నారని ఆయన వివరించారు. కార్యక్రమంలో గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యల్లంకి మధు, చెరుకుమల్ల రాజేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.